# టీజీ ఈఏపీ సెట్ లో 975వ ర్యాంక్ సాధించిన కీర్తి మండల్



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** టీజీ ఈఏపీ (TG EAPCET) సెట్ లో రాష్ట్ర స్థాయిలో 975వ ర్యాంక్ సాధించిన కీర్తి మండల్ను ఎక్స్ ఆర్మీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.శివకుమార్ అభినందించారు. దేశ రక్షణలో సేవలందించిన మాజీ సైనిక కుటుంబానికి చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. మాజీ సైనికుడు కార్తీక్ మండల్ కుమార్తె అయిన కీర్తి మండల్ ఈనెల 17న విడుదలైన ఫలితాల్లో టాప్–1000లో స్థానం సంపాదించడం విశేషమన్నారు. క్రమశిక్షణ, కష్టపడి చదివే తత్వం, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఈ విజయాన్ని సాధించడం అభినందనీయమని కొనియాడారు. అదేవిధంగా కీర్తి మండల్ ఎన్డీఏ రాత పరీక్షలో కూడా అర్హత సాధించడం సంతోషకరమని పేర్కొన్నారు. రానున్న తదుపరి ఎంపిక దశలను విజయవంతంగా పూర్తి చేసి జిల్లాకు, ఎక్స్ ఆర్మీ అసోసియేషన్కు మరింత పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కీర్తి మండల్తో పాటు ఆమె తండ్రి కార్తీక్ మండల్కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పియూష్ మండల్, సీనియర్ పాట్రాన్ పాపయ్య సార్, కిషన్ అమనగంటి, శివపాద మండల్, సుశాంత్ బర్మన్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుతో విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల రేపల్లెవాడ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గ్రామంలో గృహ అవసరాలకు సరిపడా విద్యుత్ అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామస్థులు సర్పంచ్ ఆకుల వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను తెలుసుకున్న సర్పంచ్ వెంటనే విద్యుత్ శాఖ ఏఈ జాన్కు సమాచారం అందించారు. దీంతో ఆయన తక్షణమే స్పందించి లైన్ ఇన్స్పెక్టర్ చంద్రయ్యతో పాటు విద్యుత్ సిబ్బంది నరేష్ను గ్రామానికి పంపించారు. శుక్రవారం గ్రామంలో కొత్త డీటీఆర్ (ట్రాన్స్ఫార్మర్)ను ఏర్పాటు చేశారు. చాలా రోజులుగా కొనసాగుతున్న విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించిన సర్పంచ్ ఆకుల వెంకటేష్, విద్యుత్ శాఖ అధికారులు, విద్యుత్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొల్లూరి సంగీత ప్రకాష్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థు లు పాల్గొన్నారు.

# కార్మికులకు కనీస వేతనాల పెంపు హర్షనీయం



**ఉద్యమ కెరటం, తాండూర్:** రాష్ట్రంలోనీ 1.11 కోట్ల కార్మికులకు కనీస వేతనాలు పెంచుతూ ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్ద బోయిన శంకర్ అన్నారు. శుక్రవారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబిలో కార్మికుల వేతనాల పెంపును హర్షిస్తూ సిఎం రేవంత్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వర్యులు వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామిల చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్మికులు క్షీరాభిషేకం చేశారు. కార్మికులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పటాకాలు పేల్చి మిఠాయిలు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్ గౌడ్, షేక్ మోమిన్ అలీ, పుట్ట శ్రీనివాస్, నవీన్ పటేల్, మాసడి ప్రభాకర్, భీమారాజు కుమార్, కటికల మల్లేష్, వెంకటేష్ గౌడ్, జావిద్, పెద్దబోయిన రవి, గౌస్, వేణు, కోయిల్ పటేల్, కొయ్యడ రవి, గంగారాం, నరేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెంకటేశ్వరస్వామి దేవస్థాన భూముల కౌలు వేలం

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** వేంసూరు మండలంలోని కందుకూరు గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో దేవస్థానానికి చెందిన వ్యవసాయ భూముల కౌలు హక్కుల బహిరంగ వేలాన్ని నిర్వహించనున్నట్లు దేవస్థాన నిర్వహణాధికారి పివి. రమణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 26న ఉదయం 11.30 గంటలకు దేవాలయ ప్రాంగణంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2026–2027, 2027–2028 సంవత్సరాలకు సంబంధించిన రెండు సంవత్సరాల కాల పరిమితికి కౌలు హక్కులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కందుకూరు, భరణిపాడు గ్రామాల్లో ఉన్న దేవస్థాన భూములను ప్లాట్లుగా విభజించి బహిరంగ వేలం



ద్వారా కౌలుకు ఇవ్వనున్నట్లు చెప్పారు. మొత్తం 24 ప్లాట్లలో తరి, బీడు భూములు ఉండగా, అగ్రహారం భూములు కూడా పొందుపర్చినట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనాలనే వారు నిర్ణీత ధరావత్తును డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. 1 నుంచి 23వ ప్లాట్ల వరకు రూ.25వేల ధరావత్తు, 24వ ప్లాటుకు రూ.15వేలుగా నిర్ణయించారు. అలాగే ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, డ్రైవింగ్ లైసెన్స్ జిరాక్స్ ప్రతులను సమర్పించాల్సి ఉంటుందనితెలిపారు. వేలంలో హెచ్చుపాట దక్కించుకున్న వారు మొదటి సంవత్సర కౌలు మొత్తంలో సగభాగాన్ని వెంటనే చెల్లించాల్సి ఉండగా, మిగతా మొత్తాన్ని ఆమోదం వచ్చిన 15 రోజులలోపు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. రెండో సంవత్సరానికి సంబంధించిన కౌలు మొత్తాన్ని 2027 మే 31లోపు చెల్లించాలని స్పష్టం చేశారు. దేవస్థాన భూములను కేవలం వ్యవసాయ అవసరాలకే వినియోగించాలని, వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు ఉపయోగించ రాదని పేర్కొన్నారు. అనుమతి లేకుండా బోర్లు వేయడం, నిర్మాణాలు చేపట్టడం, చెట్లు నరకడం వంటి చర్యలు నిషేధమని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన పక్షంలో కౌలు రద్దు చేసి భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. వేలానికి సంబంధించిన పూర్తి వివరాలు, ప్లాట్ల హద్దులు దేవస్థా న కార్యాలయ పనివేళల్లో తెలుసుకోవచ్చని వివరించారు.

# రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్త నాల పంపిణీ

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని రైతులకు విత్తనాలను అందజేశారు. సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాలకు చెందిన రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తూ భూమి సారాన్ని పెంచే పచ్చిరొట్ట పంటలను సాగు చేయాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు అవసరమైన విత్తనాలు, సబ్సిడీలు, సాంకేతిక సలహాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, వ్యవసాయ శాఖ అధికారులు, సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరు మండలాల ఏఓలు, ఏఈఓలు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు.



# ఐకేపీ కేంద్రాల్లో రైతు సమస్యలు పరిష్కరించాలి

- తహశీల్దార్కు బీజేపీ నాయకుల వినతి

**ఉద్యమ కెరటం, హన్మకొండ:** దామెర మండలంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం తహశీల్దార్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకుడు గురిజాల శ్రీరామ్ రెడ్డి మాట్లాడుతూ ఐకేపీ కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేవని, గన్నీ బ్యాగుల కొరత, తూకం సమస్యలు, సకాలంలో చెల్లింపులు జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని రోజుల తరబడి కేంద్రాల్లో ఉంచాల్సి వస్తోందని, దీంతో వర్షాలు పడితే నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు జంగిలి నాగరాజు, నియోజకవర్గ కోకన్వీనర్ మాదారపు రతన్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి సూర చందర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పావుడల మధుకర్, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల సుధాకర్, కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి గంకిడి బుచ్చిరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల రమేష్, శక్తి కేంద్ర ఇన్చార్జ్లు గోగుల సమ్మిరెడ్డి, గందు పరశురాం, బూత్ అధ్యక్షులు వేల్పుల ప్రశాంత్, నూకల రవీందర్, నాయకులు కన్నె కొమురయ్య, మాదం గట్టయ్య, గడ్డం కార్తీక్, గడ్డం వేణు తదితరులు పాల్గొన్నారు.



# రానున్న ఎన్నికల్లో పద్మశాలీల సత్తా చాటాలి

**ఉద్యమ కెరటం, హన్మకొండ:** రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పద్మశాలి సామాజిక వర్గం సత్తా చాటాలని పద్మశాలి సంఘం నాయకులు తీర్మానించారు. హన్మకొండలోని వి–కన్వెన్షన్ హాల్లో శుక్రవారం జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు బచ్చు ఆనందం అధ్యక్షతన జిల్లా పద్మశాలి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి, పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి తౌటం రవీందర్ పాల్గొన్నారు. రాజకీయ, సామాజిక రంగాల్లో పద్మశాలీలకు తగిన ప్రాధాన్యత కల్పించేందుకు సంఘటితంగా ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామర్తపు మురళి, ప్రధాన కార్యదర్శి రామచంద్రారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలి యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొని నాయకత్వాన్ని ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వైద్యం రాజగోపాల్, బొప్ప శివశంకర్, పులికంటి రాజేందర్, వెంగళ వేణుగోపాల్, పోరండ్ల కృష్ణప్రసాద్, విజయ్కుమార్, కోటేశ్వర్, నల్ల సత్యనారాయణ, సత్యూరు సంతోష్, డీఎస్ మూర్తి, బాలకృష్ణ, బింగి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# సిర్పూర్ మీదుగా పశువుల అక్రమ రవాణాను అరికట్టాలి

- డీజీపీ సీవీ ఆనంద్కు ఎమ్మెల్యే హరీష్బాబు వినతి

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల నుంచి సిర్పూర్ నియోజకవర్గం మీదుగా హైదరాబాద్కు జరుగుతున్న గోవులు, పశువుల అక్రమ రవాణాను అరికట్టాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్బాబు డీజీపీ సీవీ ఆనంద్ను కోరారు. హైదరాబాద్లోని డీజీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కౌటాల ప్రాంతంలోని పశువుల వారసంతను అడ్డాగా చేసుకుని పశువుల స్మగ్లర్లు భారీ స్థాయిలో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రోజురోజుకూ ఈ అక్రమ రవాణా పెరుగుతోందని, దీంతో స్థానిక ప్రజల్లో ఆందోళన నెలకొందన్నారు. పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న గోరక్షాదళ సభ్యులపై పోలీసులు బైండ్ ఓవర్ కేసులు నమోదు చేసి, రిమాండ్ చేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. పశువుల స్మగ్లింగ్ను అరికట్టడంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాల్సిందిపోయి, కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పెరుగుతున్న అక్రమ రవాణా నేపథ్యంలో ఈనెల 16న కౌటాల పశువుల సంతను మూసివేశారని, అయితే ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో ఈనెల 20న మళ్లీ సంత ప్రారంభించారని పేర్కొన్నారు. పోలీసుల సమక్షంలోనే పశువుల అక్రమ రవాణా కొనసాగడం దురదృష్టకరమన్నారు. అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కౌటాల పశువుల వారసంతను తక్షణమే మూసివేసి, స్మగ్లింగ్పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



# వ్యవసాయ అధికారిణిపై కుల దూషణ

## నిందితుడిపై అట్రాసిటీ కేసు నమోదు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** విధుల్లో ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారిణిని కులం పేరుతో దూషిస్తూ, బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై నేరడిగొండ పోలీస్ స్టేషన్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఇచ్చోడ రూరల్ సీఐ సిహెచ్ రమేష్ తెలిపారు. నేరడిగొండ మండలంలోని కుమారి క్ల స్టర్లో వ్యవసాయ విస్తరణ అధికారిణిగా సాయి కీర్తన విధులు నిర్వహిస్తున్నారు. యాసంగి సీజన్కు సంబంధించిన పంట నమోదు ప్రక్రియను ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపడుతున్న క్రమంలో కుమారి గ్రామానికి చెందిన గడ్డం చంద్రశేఖర్ రెడ్డి అనే వ్యక్తి తన భూమి వివరాలను తిరిగి నమోదు చేయాలని తరచూ ఫోన్ చేసి ఒత్తిడి తెచ్చినట్లు తెలిపారు. తాను విలేకరినని చెప్పుకుంటూ అధికారిణిపై అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా, తన గ్రామంలో తక్కువ కులాల వారు పనిచేయకుండా చూస్తానంటూ కులం పేరుతో దూషించి బెదిరించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గడ్డం చంద్రశేఖర్ రెడ్డిపై నేరడిగొండ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# గంజాయి విక్రయిస్తు న్న ముగ్గు రు అరెస్ట్

## పరారీలో మరో నిందితుడు

## 820 గ్రాముల గంజాయి స్వాధీనం





**ఉద్యమ కెరటం, వాంకిడి:** మండలంలోని బంబారా గ్రామ పరిధిలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్ తెలిపారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడి మండలంలోని బంబారా గ్రామానికి చెందిన చునార్కర్ శ్రీకాంత్, మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా రాజుర ప్రాంతానికి చెందిన గణపత్ బావంకర్ తో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా బెదోడ గ్రామానికి చెందిన ఆదిత్య అనే నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి మొత్తం 820 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దాని విలువ సుమారు రూ.20,500 ఉంటుందని చెప్పారు. జిల్లాలో అక్రమ మాదకద్రవ్యాల రవాణా, వినియోగం, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నారని డీఎస్పీ అశోక్ హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# తాత్కాలికంగా గోయాగం పశువుల సంత బంద్

## జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నిర్ణయం

**ఉద్యమ కెరటం, వాంకిడి:** వాంకిడి మండల కేంద్రంలోని గోయాగం గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి బుధవారం నిర్వహించే పశువుల వారపు సంతను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాత్కాలికంగా బంద్ చేసినట్లు గ్రామ సర్పంచ్ దుర్వ ఇస్రుబాయి, గ్రామపంచాయతీ కార్యదర్శి స్రవంతి తెలిపారు. ఆవుల అక్రమ రవాణాను అరికట్టే చర్యల్లో భాగంగా పశువుల సంతను తాత్కాలికంగా నిలిపివేయాలని అధికారులు సూచించడంతో సంత కాంట్రాక్టర్, స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా సహకరించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం నిర్వహించాల్సిన పశువుల సంతను పూర్తిగా బంద్ పాటించారు. జిల్లా కలెక్టర్ నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు గోయాగం పశువుల సంతను నిలిపివేస్తామని స్పష్టం చేశారు.

# ప్రగతి ప్రణాళికతోనే జిల్లాల సమగ్రాభివృద్ధి

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' ద్వారానే గ్రామాలు, పట్టణాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్టి యు భవన్ లో నిర్వహించిన 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి సమావేశానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో కంటే భిన్నంగా క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా నిధుల కేటాయింపులు జరపడమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతి గ్రామానికి ఒక స్పష్టమైన, ఆచరణాత్మకమైన ప్రణాళిక ఉండాలని, దీనికోసం మండల, గ్రామ స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిధుల వినియోగం, పనుల గుర్తింపులో పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, రోడ్లు , డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని దిశా నిర్దేశం చేశారు. వీటితో పాటు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. హరితహారం, పారిశుధ్య నిర్వహణ పక్కాగా జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రగతి ప్రణాళికలో ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు చురుగ్గా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తక్షణమే గ్రామ సభలు నిర్వహించి, ప్రజల నుంచి నేరుగా వినతులు, సూచనలు స్వీకరించి సమగ్ర నివేదికలు రూపొందించాలన్నారు. నిర్ణీత గడువులోగా నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసి, ఆదిలాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే ప్రగతి పథంలో ముందుంచడానికి ప్రతిఒక్కరు బాధ్యతగా పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం మెగా జాబ్ మేళ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు, పదవ తరగతిలో అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, పుస్తకం, చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ గ్రామా పంచాయితీలకు ప్రశంస పత్రాలను అతిథులు అందజేశారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీఓ మంద మకరంద్, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మునిసిపల్ కమీషనర్ జగదీశ్వర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా , మండల స్థాయి అధికారులు, ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# అసంఘటిత కార్మికులకు న్యాయం జరిగింది




**ఉద్యమ కెరటం, తాండూర్:** తెలంగాణ రాష్ట్రంలోని ఒక కోటి 11 లక్షల అసంఘటిత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించిందని ఐఎన్టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్, కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రావు పేర్కొన్నారు. శుక్రవారం తాండూర్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జన ప్రసాద్ చొరవతోనే కార్మికులకు వేతనాల పెంపు సాధ్యమైందన్నారు. ఆయన రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వేతన సవరణలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికలు అందించడంతో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి నాయకత్వంలోని ప్రభుత్వం కార్మిక పక్షపాతి ప్రభుత్వమని మరోసారి నిరూపితమైందన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అసంఘటిత కార్మికులకు పెద్ద ఊరటనిచ్చిందని పేర్కొన్నారు. సింగరేణిలో గత ఎన్నికల సమయంలో ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ యూనియన్లు అక్రమ పొత్తులతో గెలిచిన తర్వాత కార్మిక సమస్యలను పూర్తిగా విస్మరించాయని ఆరోపించారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మళ్లీ కార్మికులను మభ్యపెట్టేందుకు ఉద్యమాల పేరుతో నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని డ్యూటీ షిఫ్ట్ సమయాల్లో మార్పులు చేసి కార్మికులకు ఉపశమనం కల్పించాలని యాజమాన్యాన్ని కోరారు. బెల్లంపల్లి ఏరియాలో గోలేటి, మహావీర్ వంటి కొత్త ఓపెన్కాస్ట్ గనుల ఏర్పాటు ద్వారా సింగరేణి మనుగడను కాపాడాలని సూచించారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలిగా కవిత ఉన్న సమయంలోనే కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకుందని, అప్పుడు స్పందించని వారు ఇప్పుడు కార్మిక హక్కుల పేరుతో మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. కార్మిక హక్కుల సాధన ఐఎన్టీయూసీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏరియా కార్యదర్శులు మాధవ కృష్ణ, చంద్రకుమార్, ఏరియా ఆర్గనైజింగ్ కార్యదర్శి మాసాడి నారాయణ, స్వామి కైరిగూడ కార్యదర్శి భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మట్టి రవాణాపై పోలీసుల కొరడా

- **19 కేసులు నమోదు.. 45 వాహనాలు సీజ్**
- **జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**



**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** జిల్లాలో అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు చేపడుతోందని జిల్లా ఎస్పీ మ హేష్ బి.గితే తెలిపారు. అనుమతులు లేకుండా మట్టి తరలింపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం ఎస్పీ మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటివరకు అక్రమ మట్టి రవాణాకు సంబంధించి మొత్తం 19 కేసులు నమోదు చేసి 45 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇందులో 27 ట్రాక్టర్లు, 11 టిప్పర్లు ,7 జేసీబీలు ఉన్నాయని వివరించారు. జిల్లాలో ఎక్కడైనా మట్టి తవ్వకం, నిల్వ, రవాణా చేపట్టాలంటే సంబంధిత శాఖల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. గడిచిన వారం రోజుల్లో జిల్లాలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్లో పలు పోలీస్ స్టేషన్ పరిధిలో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదు చేసి మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకోగా, వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక జేసీబీ, నాలుగు ట్రాక్టర్లు, రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు టిప్పర్లు, ఐదు ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఒక ట్రాక్టర్ను సీజ్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమ మట్టి తవ్వకాలు, రవాణా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# పెగడపల్లి ఘటన దళిత సమాజ ఆత్మగౌరవంపై దాడి

- **ఎంహెచ్డీ నాయకుడు కూడెల్లి భరత్ కుమార్**



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** పెద్దపెల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో ఎల్లమ్మ తల్లి బోనాల జాతర సందర్భంగా దళితులపై జరిగిన అమానవీయ ఘటనను మాదిగ హక్కుల దండోరా మండల ప్రధాన కార్యదర్శి కూడెల్లి భరత్ కుమార్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన దళిత సమాజ ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. మొక్కు చెల్లించేందుకు బోనాలతో వెళ్లిన దళిత మహిళలను ఆలయంలోకి అనుమతించకుండా సుమారు ఆరు గంటల పాటు బయట నిలబెట్టి, కులం పేరుతో అవమానించడం అమానవీయమని పేర్కొన్నారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా దళిత సమాజాన్ని కలిచివేసిందన్నారు. బాధితులు రోడ్డుపై బోనాలతో బైఠాయించి ఆందోళన చేపట్టడంతో పోలీసులు స్పందించి 20 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం స్వాగతించదగ్గ విషయమన్నారు. అయితే కేసులు నమోదు చేయడమే కాకుండా నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి ఘటనలను మాదిగ హక్కుల దండోరా ఎట్టి పరిస్థితుల్లో సహించబోదని హెచ్చరించారు. రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఎంహెచ్డీ బృందం గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పినట్లు తెలిపారు. రాజకీయ ఒత్తిళ్ల కు లొంగకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రగతి ప్రణాళిక దోహదం

- **మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా ప్రగతి ప్రణాళిక' ద్వారా గ్రామీణ ప్రాంతాలతో పాటు వ్యవసాయ రంగానికి కూడా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్లో నిర్వహించిన 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించడం ద్వారా రైతులకు మెరుగైన సదుపాయాలు అందించవచ్చన్నారు. ముఖ్యంగా గ్రామీణ రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, వ్యవసాయ అనుబంధ మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందని అన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మెగా జాబ్ మేళా ద్వారా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో మంద మకరంద్, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికను ప్రజల భాగస్వామ్యంతో అమలు చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జడ్పీ సీఈఓ గణపతి, ముఖ్య ప్రణాళిక అధికారి పాపయ్య, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, మున్సిపల్ చైర్పర్సన్లు తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. రెండు పడక గదుల ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా లాటరీ విధానంలో కేటాయిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేస్తున్నామని, త్వరలో రెండో విడత ప్రారంభం కానుందని వివరించారు. పింఛన్ల జీవన ప్రమాణీకరణ ప్రక్రియ కొనసాగుతోందని, కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గృహజ్యోతి పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని అన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు రుణ సదుపాయాలు కల్పించి స్వయం ఉపాధి అవకాశాలు పెంచుతున్నామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణం పూర్తయిందని, త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు జారీ చేసి సన్నబియ్యం పంపిణీ కొనసాగిస్తున్నామని, రైతు భరోసా, రైతు బీమా పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందిస్తున్నామని పేర్కొన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. త్వరలో పాఠశాలల్లో అల్పాహార పథకం ప్రారంభించనున్నట్లు అన్నారు. దండేపల్లి, సోమనపల్లి, బెల్లంపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవల కోసం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం వేగంగా సాగుతోందన్నారు. ప్రజా సమస్యలపై అధికారులు తక్షణ స్పందనతో పనిచేయాలని, జిల్లా అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# మండుటెండల్లో 'కరెంట్' కోతలు

- **ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు..!**
- **అధికారుల నిర్లక్ష్యమా..? లేక వ్యవస్థాగత లోపమా..?**

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:**
ఒకవైపు భగభగ మండే ఎండలు.. మరోవైపు గాలి కూడా ఆడని ఉక్కపోత. ఇలాంటి క్లిష్ట సమయంలో ప్రజలకు అత్యవసరమైన విద్యుత్ సరఫరాలో చోటుచేసుకుంటున్న పదేపదే అంతరాయాలు స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అసలే వేసవి కాలం, ఏసీలు, కూలర్లు నమ్ముకున్న ప్రజలు కరెంటు లేక అల్లాడిపోతున్నారు.

**ఉక్కిరిబిక్కిరి అవుతున్న సామాన్యుడు**

ప్రస్తుతం ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఇంట్లో ఉంటే ఉక్కపోత, బయట ఉంటే ఎండల తీవ్రతతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో వృద్ధులు, చిన్నారులు, రోగులు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ లేక నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోందని వాపోతున్నారు.





**అధికారులపై పెరుగుతున్న ఆగ్రహం..**

చీటికీ మాటికీ కరెంటు కోతలు విధిస్తున్నా, దీనిపై స్పష్టమైన సమాచారం ఇవ్వడంలో విద్యుత్ శాఖ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ముందస్తు సమాచారం లేదు..**

సాంకేతిక కారణాల పేరుతో గంటల తరబడి విద్యుత్ నిలిపివేస్తున్నా, కనీసం వినియోగదారులకు ముందస్తు సమాచారం అందడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఫిర్యాదు చేసేందుకు హెల్ప్లైన్ నంబర్లకు ఫోన్ చేసినా ఎవరూ స్పందించడం లేదని, ఒకవేళ స్పందించినా 'మరమ్మతులు జరుగుతున్నాయి' అనే ఒకే సమాధానం వినిపిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిర్లక్ష్యమా..? అసలు సమస్యేంటి..?**

వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని తెలిసినా, అధికారులు ఎందుకు అప్రమత్తం కాలేదనేది ప్రధాన ప్రశ్న. పాతబడిన ట్రాన్స్ఫార్మర్లు, వేలాడే విద్యుత్ తీగలు, సరైన నిర్వహణ లేకపోవడంతోనే చిన్నపాటి గాలికి, ఎండలకు కరెంటు సరఫరా నిలిచిపోతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. లోడ్ షెడ్డింగ్ లేదని ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉండటంతో అధికారుల సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

**ప్రజల డిమాండ్..**

వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి, సరఫరాలో అంతరాయాలను నివారించాలని, వేసవి దృష్ట్యా విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. కనీసం లో–వోల్టేజ్ సమస్యలు రాకుండా మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే ఆందోళనలు తప్పవని పలువురు హెచ్చరిస్తున్నారు.

# బాలిక విద్యను ప్రోత్సహించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ




**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** దళిత బాల బాలికల విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భాగ్యరెడ్డి వర్మ జయంతి కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ దళిత బాలికల విద్యకు ప్రాధాన్యం ఇచ్చి పాఠశాలలు స్థాపించి వారి అభ్యున్నతికి కృషి చేశారని తెలిపారు. సంఘ సంస్కర్తగా బాల్య వివాహాలు, దేవదాసి, జోగిని వంటి దురాచారాల నిర్మూలన కోసం పోరాడారని చెప్పారు. సాహిత్యం, హరికథలు, ఉపన్యాసాల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకువచ్చారని పేర్కొన్నారు. మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆనందదాయకమని తెలిపారు. వారి ఆదర్శాలను ప్రతిఒక్కరూ ఆచరిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి హనుమంతరెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ కళాశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- **జూన్ 5 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షల్లో 7.0 సీజీపీఏ, అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు కార్పొరేట్ ఇంటర్ కళాశాలల్లో ప్రవేశానికి అర్హులని తెలిపారు. అభ్యర్థులు ఈనెల 20వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ లోగా www.telanganaepass.gov.in వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 10వ తరగతి మెరిట్ ఆధారంగా సీజీజీ ద్వారా ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు సమయంలో మీ సేవ ద్వారా పొందిన ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మార్కుల మెమో, ఐదు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, మొబైల్ నెంబర్, ఈ–మెయిల్ ఐడి సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే బీఈఎస్, హెచ్పీఎస్ విద్యార్థులు సంబంధిత జిల్లా అధికారుల ద్వారా మ్యాపింగ్ చేసుకోవాలని, సీబీఎస్ఈ విద్యార్థులు 10వ తరగతి వివరాలను జిల్లా అధికారుల ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలంగాణలోనే చదివి ఉండాలని తెలిపారు. ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహ విద్యార్థులు బోనఫైడ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని, అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.




# నజ్రుల్ నగర్లో మాడ్రన్ ఫిష్ మార్కెట్ నిర్మించాలి

- **జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ను కోరిన ఎమ్మెల్యే**



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** ఈజ్గాం గ్రామపంచాయతీ పరిధిలోని నజ్రుల్ నగర్ బెంగాలీ క్యాంపులో మాడ్రన్ ఫిష్ మార్కెట్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ బిజయ్ కుమార్ బెహెరాను కోరారు. శుక్రవారం హైదరాబాద్ రాజేంద్రనగర్లోని జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నజ్రుల్ నగర్ బెంగాలీ క్యాంపులో పెద్ద ఎత్తున చేపల పెంపకం, చేపల వ్యాపారం జరుగుతోందని తెలిపారు. స్థానిక మత్స్యకారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సౌకర్యాలతో కూడిన హోల్సేల్ ఫిష్ మార్కెట్ నిర్మాణం అత్యవసరమని వివరించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై స్పందించిన బిజయ్ కుమార్ బెహెరా మాడ్రన్ ఫిష్ మార్కెట్ నిర్మాణానికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో స్థానిక మత్స్యకారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

# ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ రాములు**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేసి గోదాములకు తరలించిన ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ మండలం తీగల్ పహాడ్ లోని గోదామును ఏసీఎస్ఓ వేణుగోపాల్, నస్పూర్ మండల తహశీల్దార్ సంతోష్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిబంధనల మేరకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతుల కోసం కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి గోదాములకు తరలించిన ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని గోదాం నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

# కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా కుర్మే మహేందర్



**ఉద్యమ కెరటం, నేరడిగొండ (బోథ్):** బోథ్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కుర్మే మహేందర్ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా నియమించడంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. పార్టీకి దీర్ఘకాలంగా సేవలందిస్తున్న మహేందర్కు ఈ పదవి రావడం పట్ల నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. గతంలో ఎంపీటీసీగా పనిచేసిన కుర్మే మహేందర్, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తన భార్య కుర్మే అన్నపూర్ణను బోథ్ సర్పంచ్గా గెలిపించుకొని స్థానిక రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా కుర్మే మహేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో సేవలు అందించినందుకే తనకు ఈ పదవి దక్కిందన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, మాజీ ఎంపీ సోయం బాపురావు, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి ఆడే గజేందర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

